# మహువాపై వేటు

న్యూఢిల్లీ, డిసెంబర్ 8: పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగేందుకు డబ్బులు తీసుకున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాపై బహిష్కరణ వేటు పడింది. శుక్రవారం లోక్‌సభ నుంచి ఆమెను బహిష్కరించారు. ఈ మేరకు ఎథిక్స్ కమిటీ ఇచ్చిన నివేదికను లోక్‌సభ ఆమోదించింది. ఈ సందర్భంగా జరిగిన వాడీవేడి చర్చలో మొయిత్రా మాట్లాడటానికి అవకాశం కల్పించాలని ప్రతిపక్ష సభ్యులు చేసిన డిమాండ్‌ను స్పీకర్ అంగీకరించలేదు. గతంలో ఈ తరహా ఉదంతాల్లో నిందితులకు స్పీకర్ మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఉదహరించారు. మొయిత్రా చర్యను అనైతిక ప్రవర్తనగా పేర్కొంటూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ మూజువాణి పద్ధతిలో ఆమోదించింది. ఓటింగ్ సమయంలో విపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. లోక్‌సభ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ అనధికార వ్యక్తులతో పంచుకోవడం దేశ భద్రతపై ప్రభావం చూపిస్తుందని ప్రహ్లాద్ జోషి అన్నారు.

**ప్రజాస్వామ్యానికి ద్రోహం చేయడమే**

మొయిత్రా సస్పెన్షన్‌పై తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా మండిపడ్డారు. ఇది భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ద్రోహం చేయడమేనన్నారు. 'మా పార్టీ ఆమెకు అండగా నిలబడుతుంది. బీజేపీ ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నది' అని మీడియా సమావేశంలో మమత అన్నారు. మరోవైపు ఎథిక్స్ కమిటీ ఇచ్చిన 500 పేజీల నివేదిక చదవడానికి 48 గంటల సమయం ఇవ్వాలని టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ శుక్రవారం లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాశారు. మొయిత్రా సస్పెన్షన్‌ను ప్రతిపక్ష పార్టీలు ఖండించాయి. బీజేపీ ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నదని ఆరోపించాయి.

## లోక్‌సభ నుంచి తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ బహిష్కరణ

- ఎథిక్స్ కమిటీ నివేదికకు సభ ఆమోదం
- ప్రశ్నలకు ముడుపుల కేసులో చర్యలు
- చర్చలో మహువాకు మాట్లాడే అవకాశం ఇవ్వని స్పీకర్ ఓం బిర్లా
- నైతిక విలువల కమిటీ ప్రతి నిబంధననూ ఉల్లంఘించింది
- ప్రతిపక్షాన్ని అణగదొక్కేందుకు పార్లమెంటరీ కమిటీని ఆయుధంగా వినియోగిస్తున్నారు
- మహువా ఆగ్రహం
- పార్టీ ఎంపీకి మమతా బెనర్జీ బాసట



'కొత్త సభలో ఇదొక కొత్త చీకటి రోజు(బ్లాక్ డే). ఒక కొత్త చీకటి అధ్యాయం ఈ రోజు ప్రారంభమైంది' అని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధీర్ రంజన్ చౌదరి అన్నారు. మొయిత్రా సస్పెన్షన్ అంశం చర్చను వాయిదా వేయాలని ఆయన స్పీకర్‌కు లేఖ రాశారు. బీఎస్పీ ఎంపీ, ఎథిక్స్ కమిటీ సభ్యుడు డానిష్ అలీ మాట్లాడుతూ కమిటీ ఇచ్చిన నివేదిక అసంపూర్తిగా ఉందన్నారు.

**విపక్షాలను అణగదొక్కే ప్రయత్నం**

లోక్‌సభ నుంచి తనను బహిష్కరించడంపై మొయిత్రా స్పందిస్తూ అనధికార కోర్టు(కంగారు కోర్టు) ద్వారా తనపై చర్యలు తీసుకొన్నారని.. విపక్షాలను అణగదొక్కేందుకు ప్రభుత్వం పార్లమెంటరీ ప్యానెల్‌ను ఆయుధంగా చేసుకొన్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నాకిప్పుడు 49 ఏండ్లు. వచ్చే 30 ఏండ్లు నేను పార్లమెంట్ లోపల, బయట మీకు వ్యతిరేకంగా పోరాడతాను. బహిష్కరించడానికి ఎథిక్స్ కమిటీకి ఎలాంటి అధికారాలు లేవు. ఈ కమిటీ ప్రతి నిబంధననూ ఉల్లంఘించింది. రేపు నన్ను వేధించడానికి సీబీఐను మా ఇంటికి పంపుతారేమో. మీరు(బీజేపీ) నిర్దిష్ట పద్ధతిని పాటించలేదు. ఇది మీ అంతానికి నాంది. ఒక్క లాగిన్‌తో దేశ భద్రత ప్రమాదంలో పడుతుందా? అదానీ మన ఓడరేవులు, విమానాశ్రయాలన్నీ కొంటున్నారు. ఆయన షేర్ హోల్డర్లు విదేశీ పెట్టుబడిదారులు. కానీ మన మౌలిక సదుపాయాలన్నీ కొనడానికి హోం శాఖ అనుమతి ఇస్తున్నది.' అని ఆమె అన్నారు.

### మొయిత్రాపై వచ్చిన ఆరోపణలేమిటి?

అదానీ గ్రూప్ గురించి ప్రశ్నలు అడిగేందుకు తాను ఎంపీ మహువా మొయిత్రాకు డబ్బులు ఇచ్చానని వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీ ఆరోపించారు. కృష్ణా నగర్ ఎంపీ అయిన మహువా మొయిత్రా పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీని లక్ష్యంగా చేసుకొని ప్రధాని మోదీని దూషించి ఇబ్బంది పెట్టారని వెల్లడించారు. తాను కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నలు అడిగేందుకు మొయిత్రా పార్లమెంట్ లాగిన్ ఉపయోగించానని అక్టోబర్ 19న తెలిపారు. దీనిపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో హీరానందానీ అప్రూవర్‌గా మారారు. దీనిపై లోక్‌సభ ఎథిక్స్ కమిటీ నవంబర్ 9న విచారణ జరిపి హీరానందానీ ఆరోపణలు నిజమేనని.. మొయిత్రాను లోక్‌సభ నుంచి బహిష్కరించాలని ప్రతిపాదన చేస్తూ లోక్‌సభకు నివేదిక ఇచ్చింది. దూబే ఫిర్యాదుపై మొయిత్రా ఢిల్లీ హైకోర్టులో పరువు నష్టం కేసు దాఖలు చేశారు.

## ఆదిత్యుడి తొలి చిత్రం



న్యూఢిల్లీ, డిసెంబర్ 8: ఆదిత్య ఎల్-1 మిషన్‌లో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైందని ఇస్రో శుక్రవారం వెల్లడించింది. అతినీలలోహిత కిరణాల్ని వెలువరిస్తున్న సూర్యుడిని ఆదిత్య ఎల్-1లోని టెలిస్కోప్ (సూట్) ఫొటోలు తీసి, భూమిపైకి పంపింది. 200-400 నానోమీటర్ల తరంగదైర్ఘ్యంతో, అత్యంత తీక్షణశక్తిని కలిగి ఉండే ఈ కిరణాల్ని వెలువరిస్తున్న సూర్యుడి ఫొటోలు బయటకు రావటం ఇదే మొదటిసారి. అంతరిక్షంలో 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న లాగ్రాంజ్ పాయింట్ (ఎల్ 1)ను ఆదిత్య ఎల్-1 వచ్చే ఏడాది జనవరిలో చేరుకుంటుందని ఇస్రో అంచనావేస్తున్నది. శాటిలైట్ అక్కడ్నుంచి సూర్యుడి గురించి పరిశోధన చేయనున్నది.

## అమెరికా వీసా రుసుములు భారీగా పెంపు!

**ప్రతిపాదనలు సిద్ధం చేసిన యూఎస్‌సీఐఎస్**

వాషింగ్టన్, డిసెంబర్ 8: అమెరికా వీసా దరఖాస్తు ప్రక్రియ ఇకపై మరింత ఖరీదు కాబోతున్నది. వచ్చే ఏడాది నుంచి హెచ్1బీ సహా వివిధ రకాల వీసా దరఖాస్తుల రుసుముల్ని పెంచేందుకు రంగం సిద్ధమైంది. ఆదాయాన్ని పెంచుకునేందుకు, నిధుల కొరతను ఎదుర్కొనేందుకు అమెరికా పౌరసత్వం, వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) వీసా దరఖాస్తుల రుసుముల్ని భారీగా పెంచుతూ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే దీనిపై వివిధ రకాల సంస్థలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. 2016 నుంచి అమలవుతున్న ప్రస్తుత 'ఫీ రూల్'ను యూఎస్‌సీఐఎస్ మార్చాలనుకుంటున్నది. హెచ్1బీ ఈ-రిజిస్ట్రేషన్ ఫీజు 10 డాలర్ల నుంచి 215 డాలర్లకు, హెచ్1బీ వీసా దరఖాస్తు రుసుము 460 డాలర్ల నుంచి 780 డాలర్లకు పెంచాలని కొత్త 'ఫీ రూల్'లో యూఎస్‌సీఐఎస్ ప్రతిపాదించింది. దీని ప్రకారం, సిటిజన్‌షిప్ (న్యూట్రలైజేషన్) దరఖాస్తు ఫీజు 640 డాలర్ల నుంచి 760 డాలర్లకు, అత్యంత ప్రాచుర్యం పొందిన 'ఈబీ-5' (గ్రీన్‌కార్డ్ ప్రోగ్రాం) రుసుములు 11,160 డాలర్లకు పెంచాలని ప్రతిపాదించింది.

## విదేశీ విద్యార్థులకు కెనడా షాక్

**స్టూడెంట్ వీసా నిబంధనలు కఠినం.. • డిపాజిట్ రెట్టింపు చేస్తూ నిర్ణయం**

ఒట్టావా, డిసెంబర్ 8: ఉన్నత విద్య కోసం కెనడా వెళ్లే అంతర్జాతీయ విద్యార్థులకు కెనడా ప్రభుత్వం షాక్ ఇచ్చింది. స్టూడెంట్ వీసా నిబంధనలను కఠినతరం చేసింది. స్టడీ పర్మిట్ కోసం దరఖాస్తు చేసుకొనే విదేశీ విద్యార్థులు తమ ఆర్థిక సంసిద్ధతను పెంచుకొనేలా డిపాజిట్‌ను పెంచుతున్నట్టు ప్రకటించింది. ప్రస్తుతం 10 వేల డాలర్లు ఉండగా, 20,635 డాలర్లకు పెంచుతున్నట్టు వెల్లడించింది. ఈ నిబంధన జనవరి 1, 2024 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. 'కెనడాలో జీవన వ్యయం విషయంలో అంతర్జాతీయ విద్యార్థులు సవాళ్లను ఎదుర్కొంటున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని జీవన వ్యయ పరిమితిని సవరిస్తున్నాం. విద్యార్థుల వసతి కల్పనకు అవసరమైన మార్గాలను అన్వేషిస్తున్నాం. తమ నిర్ణయం ఆర్థిక బలహీనత, దోపిడీ నుంచి విద్యార్థులను రక్షిస్తుంది' అని కెనడా విదేశాంగ మంత్రి మార్క్ మిల్లర్ తెలిపారు. అదేవిధంగా అంతర్జాతీయ విద్యార్థులకు క్యాంపస్ బయట పని పరిమితిపై ఇచ్చిన మినహాయింపును వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు పొడిగిస్తున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం విదేశీ విద్యార్థులకు కెనడాలో వారానికి 20 కంటే ఎక్కువ గంటల పాటు పని చేసుకొనేందుకు వీలున్నది. కెనడాలో విద్యను అభ్యసించాలనుకొనే విద్యార్థులు స్టూడెంట్ డిపాజిట్ కింద ప్రస్తుతం 10 వేల డాలర్లు చెల్లిస్తున్నారు. ట్యూషన్ ఫీజు, ప్రయాణ ఖర్చులకు ఇది అదనం.

## గవర్నర్ల నియామక అధికారాన్ని రాష్ట్రాలకు ఇవ్వాలి

**రాజ్యసభలో ప్రైవేట్ మెంబర్ బిల్లు**

న్యూఢిల్లీ: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గవర్నర్లను నియమించే అధికారాన్ని రాష్ట్రాలకు కల్పించేందుకు రాజ్యాంగాన్ని సవరించాల్సిన అవసరం ఉన్నదని సీపీఐ(ఎం) ఎంపీ వీ శివదాసన్ ఉద్ఘాటించారు. ఇందుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు-2022 ఆమోదానికి మద్దతు తెలపాలని శుక్రవారం ఆయన రాజ్యసభలో సభ్యులను కోరారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి, ఆ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌కు మధ్య మాటల యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో శివదాసన్ నిరుడు డిసెంబర్ 9న రాజ్యసభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. దీనిపై శుక్రవారం ఆయన సభలో చర్చను ప్రారంభిస్తూ.. గవర్నర్లను కేంద్ర ప్రభుత్వం కీలుబొమ్మల్లా ఆడిస్తున్నదని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు గవర్నర్లను రాష్ట్రపతి నియమించే విధానానికి స్వస్తి పలకాలని, గవర్నర్లను తమంతట తామే నియమించుకునే అధికారాన్ని రాష్ట్రాలకు ఇవ్వడం ద్వారా ప్రజల ఆకాంక్షను గౌరవించాలని కోరారు.

## వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలి

**రాజ్యసభలో ప్రైవేట్ బిల్లు**

న్యూఢిల్లీ: వక్ఫ్ చట్టం-1995ను రద్దు చేయాలని కోరుతూ బీజేపీ ఎంపీ హర్నాథ్ సింగ్ యాదవ్ రాజ్యసభలో శుక్రవారం ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లును కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, సీపీఐ, సీపీఎం, ఆర్జేడీ తదితర ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. బిల్లుకు అనుకూలంగా 53 మంది, వ్యతిరేకంగా 32 మంది ఓటు వేశారు. దీంతో బిల్లును ప్రవేశపెట్టేందుకు ఆమోదం లభించింది. ఈ బిల్లుపై తర్వాత చర్చ జరుగుతుంది.

## సివిల్స్ సాధించిన వారిలో 63% ఇంజినీరింగ్ అభ్యర్థులే

న్యూఢిల్లీ, డిసెంబర్ 8: 2017-2021 మధ్య సివిల్స్ మెయిన్స్ క్లియర్ చేసిన అభ్యర్థుల్లో 63 శాతం మంది ఇంజినీరింగ్ చదివిన వారేనని కేంద్రం వెల్లడించింది. ఆ నాలుగేండ్ల కాలంలో మొత్తం 4,371 మంది సివిల్స్‌కు ఎంపిక కాగా, వీరిలో 2,783 మంది ఇంజినీరింగ్ విద్య చదివినవారేనని తెలిపింది. 1,033 మంది హ్యూమానిటీస్, 315 మంది సైన్స్, 240 మంది మెడికల్ సైన్స్ చదివారని పేర్కొన్నది. ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ మేరకు డాటాను రాజ్యసభలో గురువారం కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. హ్యూమానిటీస్‌లో 597 మంది, ఇంజినీరింగ్‌లో 243 మంది పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారని వివరించింది.

## నేవీలో 10,896 మంది సిబ్బంది కొరత: కేంద్రం

న్యూఢిల్లీ: భారత నావికాదళంలో సిబ్బంది కొరత ఉందని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం పార్లమెంటుకు తెలిపింది. 1,777 మంది అధికారులతో సహా 10,896 మంది సిబ్బంది అవసరమని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ.. నావికా దళంలో మొత్తం మీద 11,979 ఆఫీసర్ పోస్టులు, 76,649 సెయిలర్ పోస్టులు ఉన్నాయని చెప్పారు. అక్టోబరు 31 నాటికి 9,119 సెయిలర్స్ పోస్టులు, 1,777 అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

## రూ.220 కోట్లు స్వాధీనం!

**కాంగ్రెస్ ఎంపీ బంధువుల డిస్టిలరీలపై ఐటీ దాడులు**

భువనేశ్వర్/రాంచి, డిసెంబర్ 8: జార్ఖండ్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహూ బంధువులకు చెందిన డిస్టిలరీలపై మూడు రోజులుగా ఐటీ దాడులు కొనసాగుతున్నాయి. ఒడిశా, జార్ఖండ్‌లలో నిర్వహించిన సోదాల్లో ఇప్పటివరకు రూ.220 కోట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. 'దేశ ప్రజలు నోట్లతో నిండిన ఈ కుప్పను చూసి వారి నిజాయితీ ప్రసంగాలు వినాలి. ఏదైతే వారు ప్రజల వద్ద నుంచి దోచుకున్నారో చివరి రూపాయి వరకు తిరిగి ఇవ్వాల్సిందే. ఇది మోదీ ఇస్తున్న హామీ' అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు.

## జత కోసం 2 వేల కిలోమీటర్లు అన్వేషణ

***4 రాష్ట్రాలను చుట్టేసిన రాయల్ బెంగాల్ టైగర్***

*భువనేశ్వర్: ఆవాసం కోసం రాయల్ బెంగాల్ టైగర్ నాలుగు రాష్ట్రాలను చుట్టేసింది. ఐదు నెలల్లో దాదాపు 2,000 కిలోమీటర్లు ప్రయాణించింది. లేళ్లు, దుప్పులు వంటి జంతువులు పుష్కలంగా ఉండే ప్రదేశం కోసం అన్వేషించింది. అదే సమయంలో తనతో జత కట్టే పులి కోసం కూడా అన్వేషణ జరిపింది. ఒడిశాలోని పర్లాఖెముండి ఫారెస్ట్ డివిజన్‌కు చెందిన డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎస్ ఆనంద్ మాట్లాడుతూ, ఈ పులి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పరిస్థితులను పరిశీలించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం, శ్రీకాకుళం ప్రాంతాల్లో ఇది ప్రయాణించినపుడు ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారని చెప్పారు. కుమిలి సింగి బీట్‌లో ఏర్పాటు చేసిన కెమెరాలో దీనిని గుర్తించి, ఆ చిత్రాలను వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ)కు పంపినట్లు తెలిపారు. ఈ పులి దాదాపు 2 వేల కిలోమీటర్లు ప్రయాణించినట్లు డబ్ల్యూఐఐ నిర్ధారించిందని తెలిపారు. మానవుల వేలిముద్రల మాదిరిగానే పులుల చారలు కూడా దేనికదే ప్రత్యేకంగా ఉంటాయని వివరించారు.*

## రేప్ చేసి.. సిగరెట్లతో కాల్చి

**గొడ్డలితో నరికి చంపిన దుండగుడు..ఉత్తరప్రదేశ్‌లో దారుణ ఘటన**



లక్నో, డిసెంబర్ 8: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో మహిళలపై దారుణాలకు అడ్డుకట్ట పడటం లేదు. అత్యంత కిరాతకంగా ఓ మహిళను హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహిళపై లైంగికదాడికి పాల్పడ్డ నిందితుడు, ఆమె మొహాన్ని సిగరెట్లతో కాల్చి.. ఆ తర్వాత గొడ్డలితో నరికిచంపాడు. సుల్తాన్‌పూర్ జిల్లాలో డిసెంబర్ 3న చోటుచేసుకున్న ఈ ఘటనలో ప్రధాన నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం, ఉద్యోగం కోసం సూరజ్‌కుమార్ సోన్కర్ అనే వ్యక్తి ఓ మహిళకు కొంతమొత్తం నగదు ముట్టజెప్పాడు. ఈ వ్యవహారంలో ఆమె తన మాట నిలుపుకోలేకపోయింది. సోన్కర్‌కు ఉద్యోగం రాలేదు. తన డబ్బులు తనకు వెంటనే ఇచ్చేయాలని సోన్కర్ డిమాండ్ చేయగా, కొంత సమయం ఇవ్వాలని ఆమె కోరింది. ఇందుకు అంగీకరించని సోన్కర్ ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. అత్యంత పాశవికంగా ఆమె ముఖాన్ని సిగరెట్లతో కాల్చాడు. అనంతరం గొడ్డలితో ఆమెను నరికిచంపాడు. మృతదేహాన్ని తీసుకొచ్చి సుల్తాన్‌పూర్‌లో ఓ రోడ్డుపై పడేశాడని పోలీసులు తెలిపారు. ఒళ్లు గగుర్పొడిచే ఈ దారుణహత్యకు పాల్పడ్డ సోన్కర్ వాడిన ఈ-రిక్షా, మొబైల్ ఫోన్, గొడ్డలిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## వైన్ నాణ్యతను గుర్తించే ఏఐ టూల్

**స్విట్జర్లాండ్ పరిశోధకుల అభివృద్ధి**



న్యూఢిల్లీ: వైన్ నాణ్యతను గుర్తించే ఏఐ టూల్‌ను స్విట్జర్లాండ్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఏ ప్రాంతంలోని ద్రాక్షతో, ఏ తరహా వైన్ తయారవుతుందన్న సమాచారంతో సైంటిస్టులు 'ఏఐ' ప్రోగ్రామ్‌ను అభివృద్ధి చేశారని 'ది గార్డియన్' వార్తా కథనం పేర్కొన్నది. వైన్ నాణ్యతను కనుగొనేందుకు ల్యాబ్‌లో చేపట్టే 'గ్యాస్ క్రోమటోగ్రఫీ' పరీక్షకు ఇది ఏమాత్రమూ తీసిపోదని పేర్కొన్నది. వైన్ తయారీకి సంబంధించి పుట్టుపూర్వోత్తరాల్ని ఏఐ పరికరం బయటపెడుతుందని, మెషిన్ లెర్నింగ్ పద్ధతుల్ని ఉపయోగించి ఏఐ టెక్నాలజీని సైంటిస్టులు అభివృద్ధి చేశారని తెలిపింది. యూనివర్సిటీ ఆఫ్ జెనీవా ప్రొఫెసర్ అలెగ్జాండర్ మాట్లాడుతూ, 'వైన్ అమ్మకాల్లో ఎన్నో మోసాలు జరుగుతున్నాయి. తమ గ్యారేజీల్లో తయారుచేసిన వైన్ సీసాలకు కొందరు పాపులర్ బ్రాండ్ లేబుల్స్ అతికిస్తున్నారు. వినియోగదారుల్ని మోసగించి వేలాది డాలర్లు సంపాదిస్తున్నారు. అల్గారిథంతో పనిచేసే ఏఐ ఆధారిత పరికరం మోసాన్ని సులభంగా పసిగడుతుంది' అని తెలిపారు.

## లైంగిక వాంఛలు నియంత్రించుకోవాలన్న తీర్పు సరికాదు

**కలకత్తా హైకోర్టు తీర్పుపై సుప్రీం అభ్యంతరం**

న్యూఢిల్లీ: యువతులు లైంగికపరమైన కోరికలను నియంత్రించుకోవాలని చెప్పిన కలకత్తా హైకోర్టును సుప్రీంకోర్టు శుక్రవారం తప్పుబట్టింది. ఇటువంటి వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని, సమర్థనీయం కాదని తెలిపింది. రాజ్యాంగంలోని అధికరణ 21 ప్రకారం యువతకు గల హక్కులను ఈ సలహాలు పూర్తిగా ఉల్లంఘిస్తున్నట్లు తెలిపింది. న్యాయమూర్తులు వ్యక్తిగత అభిప్రాయాలను వ్యక్తం చేయకూడదని, బోధించకూడదని తెలిపింది. కలకత్తా హైకోర్టు 2023 అక్టోబరు 18న ఇచ్చిన తీర్పులో, 'ప్రతి యువతి సెక్స్ కోరికలను నియంత్రించుకోవాలి. రెండు నిమిషాల సుఖం కోసం లొంగిపోతే, వారు సమాజం దృష్టిలో అన్నీ కోల్పోయిన వారవుతారు' అని తెలిపింది. దీనిపై సుప్రీంకోర్టు స్వయంగా విచారణ ప్రారంభించింది.

## రూ.1000 కోట్ల ఎలక్టోరల్ బాండ్ల విక్రయం

న్యూఢిల్లీ: ఇటీవల జరిగిన తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరం అసెంబ్లీ ఎన్నికల సమయంలో భారీగా ఎలక్టోరల్ బాండ్లు అమ్ముడుపోయాయి. ఏకంగా రూ.1000 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్ల విక్రయాలు జరిగినట్టు ఎస్బీఐ తెలిపింది. వీటిలో హైదరాబాద్‌లో రూ.359 కోట్లు, ముంబైలో రూ.259 కోట్లు, ఢిల్లీలో రూ.182 కోట్లు అమ్ముడైనట్టు తెలిపింది.

## జడ్జీల నియామకాలపై నిరంతర జగడం

**నియామకాలపై నియంత్రణ కోసం పోరు**

**సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ వ్యాఖ్యలు**



ముంబై, డిసెంబర్ 8: దేశంలో న్యాయమూర్తుల నియామకాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయమూర్తుల ఖాళీలు భారీగా పెరిగిపోతున్నప్పటికీ, నియామకాలు సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉంటున్నప్పటికీ, ఈ నియామకాల్లో అంతిమంగా ఎవరి నియంత్రణ ఉండాలనే విషయంలో నిరంతర పోట్లాట జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (సీఏటీ) ముంబై బెంచ్‌కు నిర్మించిన నూతన భవనం ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడారు. కోర్టుల్లో కేసుల విచారణలో జాప్యాన్ని నివారించడంలో, న్యాయ సేవలు అందించడంలో ట్రైబ్యునళ్లు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. న్యాయమూర్తుల నియామకాల కోసం సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసులు కేంద్ర ప్రభుత్వం వద్ద చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ విషయంలో కేంద్రం, సుప్రీంకోర్టు మధ్య తరచూ వివాదం నడుస్తున్నది.

**చట్టానికి, రాజ్యాంగానికి సేవకుడిని**

భారత ప్రధాన న్యాయమూర్తి సీజేఐ చంద్రచూడ్ శుక్రవారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒక న్యాయమూర్తిగా తాను చట్టానికి, రాజ్యాంగానికి సేవకుడినని, తనకు నిర్దేశించిన స్థాయిని అనుసరించాల్సి ఉందని, వ్యక్తిగత ఇష్టాయిష్టాలకు తావులేదని అన్నారు. రోజువారీ కార్యకలాపాలలో భాగంగా సీజేఐ నేతృత్వంలోని జేబీ పార్దీవాలా, మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఆసీనులైనప్పుడు న్యాయవాది మాథ్యూస్ జె నెడుంపర ఒక అంశాన్ని ప్రస్తావించగా చంద్రచూడ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కొలీజియం వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని, సీనియర్ న్యాయవాది హోదాను రద్దు చేయాలని మాథ్యూస్ ధర్మాసనాన్ని కోరారు. 'మీ మనస్సాక్షి చెప్పిన విధంగా స్వేచ్ఛగా వ్యవహరించే హక్కు మీకుంది. అయితే భారత ప్రధాన న్యాయమూర్తిగా, మరీ ముఖ్యంగా ఒక న్యాయమూర్తిగా తొలుత నేను చట్టానికి, రాజ్యాంగానికి సేవకుడిని' అని చంద్రచూడ్ పేర్కొన్నారు. 'నాకు నిర్దేశించిన స్థాయిని నేను అనుసరించాలి. నాకిదే ఇష్టం.. నేనిదే చేస్తాను అని చెప్పలేను' అని ఆయన అన్నారు.

## కన్నడ నటి లీలావతి కన్నుమూత



బెంగళూరు: ప్రముఖ కన్నడ నటి లీలావతి (85) శుక్రవారం కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో ఆమె బెంగళూరు శివారులోని నీలమంగళలో ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆమె 600కుపైగా కన్నడ, తమిళం, తెలుగు సినిమాల్లో నటించారు. 'చంచల కుమారి'తో సినీ అరంగేట్రం చేసిన లీలావతి దక్షిణ కన్నడ జిల్లాలోని బెల్తంగడిలో జన్మించారు. 'భక్త కుంబర', 'సంత తుకారామ్', 'భక్త ప్రహ్లాద', 'మాంగల్య యోగ' వంటి చిత్రాల్లో ఆమె నటనకు గొప్ప ప్రజాదరణ లభించింది. తెలుగులో ఆమె వాల్మీకి, మర్మయోగి, ఇది కథ కాదు, కార్తీకదీపం, మరోమలుపు తదితర చిత్రాల్లో నటించారు.

## థాయ్‌లాండ్ మట్టి.. జోధ్‌పూర్ నెయ్యి

అయోధ్య: శ్రీరామ జన్మభూమిలో నిర్మితమవుతున్న రామాలయంలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు చురుగ్గా సన్నాహాలు జరుగుతున్నాయి. వచ్చే నెల 16 నుంచి 22 వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రధాని మోదీ పాల్గొంటారు. పూజా కార్యక్రమాలు వారణాసికి చెందిన వైదిక కర్మకాండ నిష్ణాతుడు పండిట్ లక్ష్మీకాంత్ మధురనాథ్ దీక్షిత్ (86) ఆధ్వర్యంలో జరుగుతాయి. 17వ శతాబ్దంలో ఛత్రపతి శివాజీ మహారాజు పట్టాభిషేకం చేయించిన పండిట్ గగ భట్ వంశానికి చెందిన వారు పండిట్ లక్ష్మీకాంత్ మధురనాథ్ దీక్షిత్. బాలుని రూపంలోని శ్రీరాముని విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. భారత దేశంతో సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంబంధాలుగల థాయ్‌లాండ్ పవిత్రమైన మట్టిని పంపిస్తున్నది. జోధ్‌పూర్‌లోని మహర్షి సాందీపని రామ్ ధరమ్ గోశాల నుంచి 600 లీటర్ల నెయ్యి అయోధ్యకు చేరుకుంది. 10 ఎద్దులతో కూడిన ఐదు బండ్లు నవంబరు 27న బయల్దేరి, 1,058 కిలోమీటర్లు ప్రయాణించి, డిసెంబరు 7 మధ్యాహ్నం 2 గంటలకు అయోధ్యకు తీసుకొచ్చాయి.

## ఏడాదికి ఆరు పంటలిచ్చే గోధుమ

- **కేవలం పది వారాల్లోనే పంట చేతికి**
- **నీటి వినియోగం కూడా 95 శాతం తక్కువే**
- **జర్మనీ పరిశోధకుల నుంచి సరికొత్త వంగడం**
- **డయాబెటిస్‌ను కట్టడి చేసే మరో గోధుమ**
- **పంజాబ్ వ్యవసాయ శాస్త్రవేత్తల అభివృద్ధి**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): ఒకవైపు పెరుగుతున్న జనాభా, మరోవైపు వాతావరణ మార్పుల కారణంగా సంభవిస్తున్న వరదలు, కరువు కాటకాలు, ఇంకోవైపు దేశాల మధ్య యుద్ధ వాతావరణం.. వెరసి ప్రపంచవ్యాప్తంగా ఆహార సంక్షోభం కట్టలు తెంచుకొంటున్నది. వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ (డబ్ల్యూఎఫ్‌పీ) అంచనాల ప్రకారం.. ప్రపంచంలో ఇప్పటికే 82.8 కోట్ల మంది ఆకలితో అలమటిస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది 49 దేశాల్లో కరువు పరిస్థితులు దాపురించవచ్చని డబ్ల్యూఎఫ్‌పీ హెచ్చరించింది. ఇదే సమయంలో ఉక్రెయిన్-రష్యా మధ్య కొనసాగుతున్న యుద్ధం ప్రపంచ దేశాల్లో ఆకలి కేకలను రెట్టింపు చేసింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో జర్మనీ పరిశోధకులు శుభవార్త చెప్పారు. ఏడాదికి ఏకంగా ఆరుసార్లు పంటనిచ్చే ప్రత్యేక గోధుమ వంగడాన్ని అభివృద్ధి చేసినట్టు మ్యూనిచ్ వర్సిటీ పరిశోధకులు వెల్లడించారు. ఈ సరికొత్త వంగడంతో కేవలం 10 వారాల్లోనే పంట చేతికొస్తుందని తెలిపారు. నీటి వాడకం కూడా 95 శాతం వరకు తగ్గుతుందని వివరించారు. ఈ మేరకు జర్మనీకి చెందిన సైన్స్ వెబ్‌సైట్ 'డ్యుయిష్ వెల్లే' ఓ పరిశోధన పత్రాన్ని ప్రచురించింది. ఒక ఎకరంలో ఏడాదికి 20 క్వింటాళ్ల గోధుమ పంటను పండించే రైతన్న.. ఈ వంగడం సాయంతో ఏడాదిలో అదే ఒక్క ఎకరాలోనే 100 క్వింటాళ్లకు పైగా పంటను పండించవచ్చని పరిశోధకులు తెలిపారు. ఈ వంగడంతో ఆహార సంక్షోభానికి ముగింపు పలకవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

**రోగాల కట్టడికి మరో వంగడం**

తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడినిచ్చే గోధుమ వంగడాన్ని జర్మనీ పరిశోధకులు తీసుకొస్తే, శరీరంలో రోగ నిరోధకశక్తిని పెంపొందించే మరో అరుదైన గోధుమ వంగడాన్ని పంజాబ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ పరిశోధకులు ఇటీవల అభివృద్ధి చేశారు. ఈ గోధుమతో ఇమ్యూనిటీ పవర్ పెరుగడమే కాకుండా టైప్-2 డయాబెటిస్, ఊబకాయం, గుండె జబ్బుల వంటి వ్యాధులను కూడా తగ్గించే వీలు ఉన్నదని పరిశోధకులు పేర్కొన్నారు.

